# శ్రీ రమణ జ్యోతి

సంపుటి-44 సంచిక - 10 హైదరాబాదు అక్టోబరు, 2024 పేజీలు - 52 రూ. 10/- సంవత్సర చందా : రూ. 100/-

# SRI RAMANA JYOTHI

Vol - 44 Issue - 10 Hyderabad October, 2024 Pages - 52 Rs. 10/- Annual Subscription Rs. 100/-



**BHAGAVAN SRI RAMANA MAHARSHI**



*ARUNACHALA HILL* (అరుణాచల గిరి)

స్మరణమా త్రముననె పరముక్తి ఫలద । కరుణామృ తజలధి యరుణాచ లమిది ॥

| | |
|---|---|
| **శ్రీ రమణ జ్యోతి** | **Sri Ramana Jyothi** |
| అక్టోబర్ 2024 | October 2024 |
| ఈ సంచికలో ... | IN THIS ISSUE ... |


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 122వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు** | శ్రీమతి మల్లాది ఫణిమాల | 11 |
| **3** | **జి.వి. సుబ్బరామయ్య** | సరోజా ప్రసాద్ | 17 |
| **4.** | **ఇద్దరు గొప్ప పండితులతో విశ్వనాథ స్వామి।** | శ్రీ రవికృష్ణ శర్మ | 21 |
| **5.** | **మూగ రాగం - మౌన గీతం** | వి. రమేష్ బాబు | 27 |
| 6. | The Road to Contentment | Dr K Subrahmanian | 30 |
| 7. | Ashtavakra Gita 29 | V Krithivasan | 37 |
| 8. | *Kanji* and *Aviyal* | | 40 |
| 9. | Lucy Cornelessen Discovers Bhagavan | Sneha Choudhury | 43 |
| 10. | Light Dialogues | SS Cohen | 49 |


## Events in Sri Ramana Kendram in October 2024

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
3. 23rd - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
4. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేసి తెలియజేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)


© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.


**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# సమాజం, సంసారం

డా॥ కే.యస్. గారి 122వ ప్రవచనం

గత సంచిక తరువాయి భాగము **అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి**

## వధువు యోధురాలు

మనదేశంలో మాత్రం, క్రొత్తగా అత్తగారింటికి వచ్చిన వధువును గురించి రాజాజీ మాట్లాడుతూ "ఈ ప్రపంచంలో గొప్ప ధైర్యం కలిగిన వ్యక్తి సైనికుడు కాదు, తన వాళ్ళు అనుకున్న వారందరినీ వదిలి తన భర్త వద్దకు వచ్చే ఒక నవ వధువు" అని అన్నారు. అప్పటివరకు ఒక కుటుంబంలో, ఒక వాతావరణంలో పెరుగుతూ వచ్చిన యువతి, వివాహమయిన తరువాత పూర్తిగా క్రొత్త వాతావరణంలో, అప్పటివరకూ పరిచయంలేని వ్యక్తులతో సర్దుకొని పోవడం ఎంతో గొప్ప విషయం అంటారు. ఇలా జరగడం మనం ప్రతిరోజూ చూస్తూనే ఉంటాం. కానీ వాటిని మనం పెద్దగా పట్టించుకోము.

**యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః**

మన శాస్త్రం చదవని వారు, మనువును గురించి ఏదేదో అంటూ ఉంటారు. అదే మనుశాస్త్రంలో, కొన్ని భాగాలలో స్త్రీలను గురించి ఎంతో గొప్ప వర్ణన ఉన్నది. ఉదాహరణకు, స్త్రీ ఏ కుటుంబంలో అయితే గౌరవింపబడదో, అక్కడ లక్ష్మీ దేవి ఉండదు అని ప్రకటించాడు.

ఒక వ్యక్తి అంత చిన్న వయస్సులో ఒక కుటుంబం నుండి మరొక కుటుంబంలోకి ప్రవేశించి, ఆ కుటుంబంలోని వారికి

తగ్గట్లు సర్దుకుపోతూ, అందరి హృదయాలను గెలుచుకునే ప్రయత్నం చేయటానికి ఎంతో ధైర్యం కావాలి. వివాహ సమయంలో ముహూర్తం దగ్గరవుతుంటే, తల్లిదండ్రులు ఎంతో ఆనందిస్తారు. ఎప్పుడైతే మాంగళ్యధారణ చేసే సమయం దగ్గరవుతుందో, అప్పుడు అంతవరకూ నిబ్బరంగా ఉన్న తండ్రి ఒక్కసారిగా కన్నీటి పర్యంత మవుతాడు. ఇదొక వింతైన అనుభవం. అప్పటివరకూ వివాహ ఏర్పాట్లను ఎంతో ఆనందంగా చేసిన తల్లితండ్రులు, మాంగళ్యధారణ జరగగానే, తమ కూతరు తమ నుండి దూరమై వెళ్లిపోతోందన్న భావన కలగటంతో, కన్నీటి పర్యంతమవుతారు. ఈ భావన ఎందుకు కలుగుతుందనేది ఎవ్వరూ చెప్పలేరు. **కా తే కాంతా కస్తే పుత్రః**

కొడుకుకు వివాహమైతే ఆనందం. ఆ తరువాత కోడలు మనతో సరిగ్గా ప్రవర్తించకపోతే దుఃఖం. దానితో వాళ్ళకు దూరంగా విడిగా ఉంటే బాగుంటుందని అనుకొని, మళ్ళీ మనలో మనం, కాలంలో అన్నీ సర్దుకుంటాయని ఆశ పడతాం. అయితే, కొన్నిసార్లు సర్దుకోవచ్చు, కొన్నిసార్లు సర్దుకోకపోవచ్చు.

ఎప్పుడైతే మనం దీనినంతటినీ 'నేను', 'నాది' అన్న భావన లేకుండా చూస్తామో, అప్పుడు మనలో ఒక వైరాగ్య స్థితి ఏర్పడుతుంది. అలా కాక కొడుకులు, కోడళ్ళు, మనవళ్ళు... ఇలా వీళ్ళందరూ మన ఆనందానికి కారణం అని భావిస్తే కనుక, మనం పొరబడినట్లే. ఎదుకంటే, ప్రతి ఒక్కరూ తమ తమ జీవితాలను జీవించాలి కనుక. **సంసారోయమతీవ విచిత్రః** - ఎంత విచిత్రమైనది ఈ సంసారం. మనవి అనుకుని, మన వద్దనే ఉంచుకోవాలని

అనుకున్నంత కాలం, మనకు దుఃఖమే మిగులుతుంది. మనల్ని మనం నియంత్రించుకోకుండా, ఇతరులను నియంత్రించాలను కోవడం హాస్యాస్పదం.

## స్వంతం అన్నది లేదు

మనల్ని మనం అదుపులో ఉంచుకోగలిగితే, ఏ చిక్కులూ ఉండవు. అందరి పట్ల దయ, అనురాగం ఏర్పడుతాయి. ఇతరుల ప్రవర్తనలో మార్పులు వస్తాయి. వాళ్ళు మనల్ని వాళ్ళలో ఒకరిగా భావిస్తారు. ఇంకొక విధంగా చెప్పాలంటే, ఎప్పుడైతే మనం ఇతరుల నుండి ఏమీ ఆశించకుండా ఉంటామో, అప్పుడు అందరూ మనకు ఏదో ఒకటి చేయటానికి సిద్ధంగా ఉంటారు. చేయకపోయినా మనమేమీ ఇబ్బంది పడము. ఉదాహరణకు ఎప్పుడైనా నేను నా కొడుకుని ఏదైనా ఒకటి చేసిపెట్టమని అడిగినప్పుడు, 90 శాతం వరకు చేస్తూ ఉండవచ్చు. ప్రత్యేక పరిస్థితులు, బాధ్యతల కారణంగా చేయలేకపోతే, మనం వెంటనే నా కొడుకు మారిపోయాడు అని అనుకోవడం జరుగుతుంది. అది సరైన పద్ధతి కాదు.

ఎప్పుడైతే కుటుంబంలోని వారందరూ నా స్వంతం, వారంతా నా అధీనంలో ఉండాలి అని అనుకుంటామో, అప్పుడు అది తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి, ప్రతిదీ మన అధీనంలో ఉండాలనే దృక్పథం మానుకొని, మనం చేయగలిగింది చేసి, మిగిలినది భగవంతునికి వదిలివేయాలి. మనం వాళ్ళ జీవితాలను నిర్దేశించగలం అనే భావనను విడనాడాలి. మనకున్న

పూర్వ అనుభవంతో ఇలా చేయకు, అలా చేయకు అని చెప్పవచ్చు. అలా సలహాలు ఇవ్వడం మంచిదే. అయితే, అడిగినప్పుడు మాత్రమే సలహాలు ఇవ్వడం అతి ఉత్తమం. అలా కాకుండా మనం పెంచుకున్న అనుబంధంతో, సలహాలను ఇచ్చి, మనం అనుకున్నట్లుగా వాళ్ళు ప్రవర్తించాలని భావించడం సరైన పద్ధతి కాదు. ఎప్పుడో ముప్పై లేదా నలభై సంవత్సరాల క్రితం మనకు జరిగిన అనుభవంతో మనం ఒక సలహాను ఇస్తుండవచ్చు. కానీ ఈ నలభై సంవత్సరాలలో ఎన్నో పరిస్థితులు మారినాయి. కాబట్టి, నలభై ఏళ్ళ క్రితం జరిగిన సంఘటనతో పోల్చి చూడడం అర్థరహితం. అతని అనుభవం ఈ మధ్యకాలంలోనిది. అలాంటి అనుభవమే పొందిన అతని స్నేహితులు అతనికి సహాయం చేస్తారు.

ప్రయోగాలు చేయడానికి స్వాతంత్ర్యాన్ని ఇవ్వండి. నేను చెప్పినట్లు నువ్వు వినలేదు కాబట్టి ఇప్పుడు అనుభవించు అని అనవద్దు. అలాంటి మాటలను మనం ఉపయోగించరాదు. భగవంతుడు మనకు స్వాతంత్ర్యాన్ని ఇచ్చాడు. ఎవరైతే స్వాతంత్ర్యాన్ని కోరుకుంటారో, వారు మాత్రమే ఇతరులకు స్వాతంత్ర్యాన్ని ఇవ్వగలరు. భగవాన్ ఎవ్వరినీ ఇది చేయమని, అది చేయమని ఎప్పుడూ చెప్పలేదు. చెప్పినది ఏదైనా ఉంటే, అది ఆనందంగా ఉండమని. ఆనందంగా ఉండాలంటే, మనల్ని మనం అర్థం చేసుకోవాలి లేదా ధ్యానం చేయాలి లేదా ఆ పరాత్పరునికి సంపూర్ణ శరణాగతి చెందాలి. భగవాన్ ఎవ్వరికీ మీరు ఇది చేస్తే ఈ ఫలితం వస్తుందని చెప్పలేదు. అటువంటి దృక్పథం కలిగి ఉండాలంటే, మనం సంపూర్ణంగా స్వతంత్రులమై ఉండాలి.

మనమెప్పుడూ భార్యా, పిల్లలూ నాకు చెందినవారు అని భావించ కూడదు. ఎప్పుడైతే దీనిని మనం అర్థం చేసుకుంటామో, మన దృక్పథంలో మార్పు వస్తుంది. అప్పుడు మనమేది చేయాలో అది చేస్తాం. ఇచ్చిన సలహాను అంగీకరించకపోయినా బాధపడము.

ఇటువంటి సందర్భాలలో భగవద్గీత మరియు ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలను చదివినప్పుడు, మనది ఏ మతమైనప్పటికీ, కృష్ణ భగవాన్ అంత గొప్పవాడు, భగవద్గీత వంటి గొప్ప గ్రంథమూ లేదని తెలియవస్తుంది. అర్జునునకు సమస్యలు ఎదురైనప్పుడు శ్రీకృష్ణుడు సలహా ఇచ్చాడు. దానిని మనమెప్పుడూ గుర్తు పెట్టుకోవాలి. శ్రీకృష్ణుడు కర్మయోగాన్ని, జ్ఞాన యోగాన్ని విశద పరచిన తరువాత, ఇదంతా నీకు గందరగోళంగా అనిపిస్తే అన్నింటినీ వదలి "నన్ను మాత్రమే శరణొందుము" అన్నాడు. అలానే నీ ధర్మం అన్యాయాన్ని ప్రతిఘటించడం అని చెప్పాడు. మనబోటి వాళ్ళమయితే, యుద్ధం చేయను, నీవు చెప్పినట్లు నిన్ను శరణొందుతాను అనేవాళ్ళం. కాని, శ్రీకృష్ణుని సన్నిధిలో అర్జునుడు యుద్ధం చేయడానికి కృతనిశ్చయుడయ్యాడు, సమరం చేశాడు కూడా. ఇంకొక విషయం గుర్తు పెట్టుకోవలసినది ఏమిటంటే, పిల్లలు మనం చెప్పిన విధంగా నడుచుకోవడం లేదు అనే బాధ కలిగినప్పుడు "యథేచ్ఛసి తథా కురు" అని శ్రీకృష్ణుడు అర్జునునితో చెప్పిన విషయాన్ని గుర్తు తెచ్చుకోవాలి. కర్మయోగం, జ్ఞాన యోగం ... ఇలా అన్ని యోగాలను గురించి వివరించాను - "ఇప్పుడు నీ ఇచ్ఛ ప్రకారం నడుచుకో" అని అర్జునుడికి పూర్తి స్వేచ్ఛనిచ్చాడు.

## ఆశ్రితులను బంధించడం పనికిరాదు

శ్రీకృష్ణుని అంతటి వాడు కనుక స్వేచ్ఛ నిచ్చాడు. అదే ఇప్పటి మన కొందరు గురువులైతే, ‘‘నీవు కోరినది నేను ఇస్తాను, మరి కొంత కాలం నా వద్దకు వస్తూ ఉండు’’ అని ఆశ్రితులను బందీ చేసే ప్రయత్నం చేస్తారు.

అలాగ కొంతకాలం సాగిన తరువాత, ఆశ్రయించినవారు మరొక గురువును వెతుకుతూ పోతారు. అన్ని బంధాలనుండి విముక్తులైన వారే, ఇతరులను బంధ విముక్తులను చేయగలరు. ‘‘మీరున్న చోటే తిరువణ్ణామలై ఉన్నది, నా దగ్గరకు రావలసిన పనిలేదు’’ అని అనేవారు భగవాన్. బంధ విముక్తులైన వారే అలా చెప్పగలరు. శ్రీకృష్ణుడు అటువంటి బంధ విముక్తుడు. అదే స్వేచ్ఛను అర్జునునికి కూడా ఇచ్చాడు. ‘‘నేను చెప్పవలసినది చెప్పాను. ఇక నీకు నచ్చిన విధంగా నడుచుకో’’ అన్నాడు శ్రీకృష్ణుడు భగవద్గీతలో. అదే మనమైతే, నేను ఎన్నో సలహాలు ఇచ్చాను, అయినా కూడా నేను చెప్పిన దానికి విరుద్ధంగా ప్రవర్తించాడు అని అంటాం. అవతలి వ్యక్తి సమస్యలో ఉన్నాడన్నదానికంటే, మనం ఇచ్చిన సలహాను ఆ వ్యక్తి పాటించలేదనే దుగ్ధ మనకుంటుంది. ఆ సమయంలో అవతలి వ్యక్తికి మంచి జరగటం కన్నా, నా మాట అవతలి వ్యక్తి వినలేదన్నదే ప్రాముఖ్యత సంతరించుకుంటుంది. మనమేమి చెప్పామో దానినే అవతలి వారు పాటించాలి అని అనుకుంటాం. అది సరైన పద్ధతి కాదు.

మనమందరమూ కనీసం కొంతైన భగవద్గీతను గురించి విని ఉన్నాము కనుక మనం ఎంత అదృష్టవంతులం అని ఒక్కొక్కసారి

అనిపిస్తూ ఉంటుంది. భగవాన్‌ను, ఎవరైనా భగవద్గీతను చదవాలా? అని అడిగితే, తప్పక చదవాలి అనేవారు. ఎంత తరచుగా చదవాలి? అని అడిగినప్పుడు, ఎల్లప్పుడూ చదువుతూనే ఉండాలి అన్నారు. అష్టావక్ర గీత, రిభు గీత ఇలా ఎన్నో గీతలు ఉన్నా కాని, 'గీత' అని అనగానే శ్రీకృష్ణుడు బోధించిన 'భగవద్గీతే' గుర్తుకు వస్తుంది.

## షరతులు లేని స్వేచ్ఛ ఉండాలి

'స్వేచ్ఛ' అన్నది ఎప్పుడూ షరతులతో కూడినదే అయి ఉంటుంది. మనం ఎంత ధనవంతులమయినా, శక్తివంతుల మయినా ట్రాఫిక్ నిబంధనలను పాటించవలసినదే. అది మన ప్రయాణాన్ని అడ్డగిస్తున్నదే అని మనకు చిరాకు కలుగవచ్చు. ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్ళు రోడ్డుమీద పోతుంటే, మొత్తం అల్లకల్లోల మౌతుంది. అందుకే మన కదలికలు, మన చర్యలు కూడా సమాజంలోని సభ్యులను ఇబ్బంది పెట్టకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతో విధి విధానాలు ఏర్పరచబడ్డాయి. వాటికి లోబడి మనం నడుచుకోవాలి. పరస్పరం ఇబ్బందులు కలిగించుకోకుండా మసలు కోవాలి. మన స్వేచ్ఛాపరిధిని తెలుసుకొని, దాని ప్రకారం నడుచు కొంటే మనకు, ఎదుటివారికి కూడా ఎటువంటి ఇబ్బందులూ ఎదురుకావు.

మనల్ని అడగకుండానే, ఇతరులకు ఉచిత సలహాలివ్వాలను కొంటే అది అసంతృప్తికే దారితీస్తుంది. అటువంటి సమయాలలో, మనకు శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పిన విషయాన్ని గుర్తు తెచ్చు కోవాలి. అడిగినప్పుడు మాత్రమే ఇతరులకు సలహాలను ఇవ్వాలి

లేదా మన కర్తవ్యంలో భాగంగా పరస్థితులను బట్టి ఇవ్వవచ్చు. ఒకవేళ ఇచ్చిన సలహాను ఇతరులు పాటించకపోతే బాధపడ కూడదు. ఇక్కడ ప్రధానమైన విషయం ఏమిటంటే, మన కర్తవ్యాన్ని మనం నిర్వర్తించడం - అంతే. ఇతరులు కనుక తాము నిర్వర్తించ వలసిన కర్తవ్యాన్ని నిర్వర్తించకపోతే, దాని వల్ల వచ్చే ఫలితాలను వారే అనుభవిస్తారు.

ఇక దగ్గరి సంబంధ బాంధవ్యాల విషయానికి వస్తే, మనము ఈమె నా భార్య అని, వీళ్ళు నా పిల్లలు అని, వాళ్ళు నాకే చెందు తారు అని, మనం చెప్పినట్లు వాళ్ళు వినాలని ఎందుకు అనుకుంటాం? ఎప్పటివరకు వీళ్ళు నా స్వంతం, నా అధీనంలోనే ఉండాలి అని భావించమో, అప్పటివరకు అంతా సవ్యంగానే ఉంటుంది. కాని దురదృష్టవశాత్తూ మనమందరమూ వాళ్ళు నా వాళ్ళు, నేను చెప్పినట్లు వినాలని అనుకుంటాం. దానివల్లనే అన్ని సమస్యలూ వస్తాయి. **కా తే కాంతా కస్తే పుత్రః సంసారోయ మతీవ విచిత్రః** ... ఎంత విచిత్రమైనది ఈ సంసారం? అసలు మనమెవ్వరము? ఎవరికి సంబంధించిన వాళ్లము? అనే విచారణ చేస్తే, మనకు సత్యం అర్థమవుతుంది. అలా విచారణ చేయాలన్నా, భగవంతుని అనుగ్రహం ఉండాలి. మనంతట మనం అటువంటి విచారణ చేయలేమని, అలా చేయటానికి కూడా భగవంతుని అనుగ్రహం ఉండాలని శంకరాచార్యులవారు అన్నారు.

******

## శ్రీ రమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# శ్రీ శివరామ రెడ్డి గారు

**శ్రీమతి మల్లాది ఫణిమాల**

ఒకప్పుడు శ్రీ రమణాశ్రమానికి చెందిన పుస్తక విక్రయశాల ఒక చిన్న గదిలో నిర్వహించబడేది. ఆ పుస్తక విక్రయశాలకు శ్రీ శివరామ రెడ్డి గారు నిర్వాహకులుగా ఉండేవారు. శ్రీ శివరామ రెడ్డి గారు చెన్నైకు, అరుణాచలానికి మధ్యలో ఉన్న 'ఆచారపాక్కం' అనే చిన్న పట్టణానికి చెందినవారు. వారి తల్లిదండ్రులు గొప్ప భూస్వాములు. అంతేకాక శివరామ రెడ్డి గారు ఒక బియ్యం మర (రైస్ మిల్లు)కు యజమాని కూడా. శ్రీ శివరామ రెడ్డి గారి కుటుంబ సభ్యులందరూ అచ్యుతదాస అనే సాధువు పట్ల అమితమైన భక్తి కలిగి ఉండేవారు. అచ్యుతదాస మహా పండితులు మరియు కవి. వారు రచించినటువంటి అద్వైత గీతములు శ్రీ శివరామ రెడ్డి గారి కుటుంబములో అందరూ పాడుకునేవారు. అచ్యుతదాస అద్వైత గీతముల వలన ప్రభావితుడైన శివరామరెడ్డి బాల్యము నుండియే అద్వైత వేదాంతము పట్ల ఎంతో ఆసక్తిని కనబరిచేవారు. శ్రీ రమణులు తరచుగా ప్రస్తావించే కైవల్యనవనీతము, యోగ వాసిష్ఠము వంటి తమిళ వేదాంత గ్రంథాలు శివరామ రెడ్డి గారు క్రమం తప్పక అధ్యయనం చేసేవారు. శ్రీ శేషాద్రి స్వామి తొలిసారిగా శ్రీ రమణులను గొప్ప మహాత్మునిగా గుర్తించిన వారు కదా! అదే క్రమంలో ఆయన గొప్పతనమును గుర్తించిన రెండవ వ్యక్తి అచ్యుత దాస. అచ్యుతదాస మొట్టమొదటిసారి శ్రీ రమణులను అరుణా

చలేశ్వరుని ఆలయంలో దర్శించుకోవడం జరిగింది. వారి శిష్యులు కొందరితో కలిసి ఆలయంలోకి ప్రవేశించిన అచ్యుతదాస కౌమార దశలో, గాఢ సమాధి స్థితిలో ఉన్న రమణుల పట్ల ఆకర్షితులై, ఇప్ప చెట్టు క్రింద ఉన్న శరీరము వయసులో చిన్నదైనప్పటికీ, బ్రహ్మానందంలో మునిగి ఉన్నట్లు వయోపరిణతి కలిగిన అచ్యుతదాస గుర్తించారు. ఒక సంవత్సరం గడిచాక సుమారు 200 మంది శిష్యులతో కలిసి అచ్యుతదాస మరల అరుణాచలానికి వేంచేశారు. ఇప్ప చెట్టు క్రింద శ్రీ రమణులు కనిపించకపోయేసరికి ఆలయం మొత్తం వెతికారు. శ్రీ రమణులు ఎక్కడా కనిపించక పోయేసరికి, వాకబు చేయగా, భగవాన్ దేహస్పృహ పూర్తిగా లేని సమాధి స్థితిలో ఉండటం వలన కార్తీకదీపం సమీపించుటచే కొంతమంది సజ్జనులు వారికి ఒక వస్త్రాన్ని చుట్టపెట్టి ఉత్సవానికి వచ్చే జనసందోహంచే వారి ధ్యానానికి భంగం కలుగకుండా ఉంటుందనే ఆలోచనతో తిరువణ్ణామలై పట్టణ శివార్లలో ఉన్న 'గురు మూర్తము' అనే చిన్న గుడికి శ్రీ రమణులను తీసుకుని వెళ్లారు అని తెలిసింది.

అప్పటికి రమణులు మహాత్మునిగా పేరు పొందలేదు. అయినప్పటికీ తన శిష్యబృందంతో కలిసి అచ్యుతదాస శ్రీ రమణులను దర్శించుకోవటానికి గురు మూర్తము చేరుకున్నారు. గురుమూర్తం చేరుకోగానే తన శిష్యులను బయటనే నిలబడమని ఆదేశించి, అచ్యుతదాస ఒంటరిగా గుడిలోనికి వెళ్లారు. సంపూర్ణ ఆత్మనిష్ఠులై ఆసీనులైన రమణులను చూడగానే వారి పాదములపై

వ్రాలి, “నేను ఆత్మనిష్ఠను గురించి, అద్వైత వేదాంతమును గురించి ఎన్నో గీతములు వ్రాసినప్పటికీ ఆ స్థితి నాకు అనుభవంలోనికి రాలేదు భగవాన్! దయచేసి నాకు ఆ స్థితిని అనుగ్రహించ వలసినది” అని ప్రార్థించారు. అచ్యుతదాస వెలుపలకు వచ్చి వారి శిష్యులతో పలికిన పలుకులు, ఆయనకు ఆ స్థితి గురు రమణులచే ప్రసాదించబడినది అనే విషయాన్ని ఋజువు చేశాయి. వారు తన శిష్యులతో, “గురు మూర్తంలో కూర్చుని ఉన్నది ప్రజ్వలిస్తున్న ఒక మహోజ్వల జ్వాల. మీరంతా దూరం నుండి ఆ మహోజ్వల జ్వాలకు ప్రణమిల్లి ఆ జ్వాల యొక్క ఆశీస్సులకై ప్రార్థించండి” అని చెప్పారు.

అచ్యుతదాస శిష్యులలో ఒకరు, శ్రీ శివరామ రెడ్డి గారికి రామ తారక మంత్రమును ఉపదేశించి షణ్ముఖి ఉపాసనా పద్ధతిలో శ్రీరామ తారకమంత్రాన్ని ఎలా జపించాలో ఉపదేశం చేశారు. శివరామ రెడ్డిగారు ఒక దశాబ్దం పాటు వారి ఊరి సమీపంలో ఉన్న అడవిలో తీవ్రంగా ఈ మంత్రాన్ని ఉపాసన చేశారు. షణ్ముఖి ఉపాసన చేయటం వలన, సాధనా క్రమంలో అప్పుడప్పుడు శ్రీ శివరామ రెడ్డి గారు ప్రకాశవంతమైన కాంతిని చూడగలిగేవారు. అలా కాంతిని దర్శించుకున్నప్పుడల్లా వారి మనసు ఆనందంతో నిండిపోయేది. కానీ మనసు చివరి పొరలలో ఎక్కడో తాను సాధించవలసినది ఇంకా ఎంతో ఉందని అధ్యాత్మ మార్గంలో అంతిమ లక్ష్యం ఇది కాదని వారికి తరచు అనిపిస్తూ ఉండేది.

ఇలా కొన్నాళ్ళు గడిచాక శ్రీ శివరామ రెడ్డి గారి భార్య మరణించారు. సహధర్మచారిణి మరణానంతరము ప్రపంచమంతా

శూన్యంగాను, జీవితము నిస్సంతోషంగానూ వారికి తోచింది. కొన్నాళ్ళు తీర్థయాత్రలు చేస్తే మానసిక ప్రశాంతత లభిస్తుంది అనే అభిప్రాయంతో శివరామ రెడ్డి గారు భారతదేశం నలుమూలలా ఉన్న పవిత్ర క్షేత్రాలన్నింటిని కాలినడకన మూడేళ్ల పాటు సందర్శించారు. ఎన్ని తీర్థక్షేత్రాలు దర్శించినప్పటికీ, వారి దుఃఖము ఏ మాత్రమూ తగ్గలేదు. ఇంతలో శ్రీరమణాశ్రమంలో నివసిస్తున్న వారి పిన తండ్రిగారు జ్ఞప్తికి వచ్చారు. వారి పేరు కృష్ణారెడ్డి గారు. కృష్ణారెడ్డి గారు అచ్యుత దాసకి ప్రత్యక్ష శిష్యులు కూడా. శ్రీ రమణుల నీడలో జీవితాన్ని కొనసాగిస్తున్న వారి పినతండ్రి వద్దకు వచ్చి చేరారు శివరామరెడ్డి గారు. 1931 ప్రాంతాల్లో శ్రీ రమణాశ్రమము ఇప్పుడు ఉన్నట్లు సవిస్తారంగా, పెద్దదిగా ఉండేది కాదు. వారి పినతండ్రి గారితో కలిసి పాతహాలు వెనక ఆయన చేతిమీదుగా పెరుగుతున్న పూలతోటలో పూలు కోసేవారు శివరామరెడ్డి గారు. ఒకరోజు పినతండ్రి గారు శివరామరెడ్డి గారి గురించి భగవాన్‌తో ప్రస్తావించి, మూడేళ్ల క్రిందట ఆయన భార్య చనిపోగా శివరామరెడ్డి దుఃఖ సాగరం నుండి బయటపడలేక పోతున్నారు అని శ్రీరమణులతో విన్నవించుకున్నారు.

ఒక రోజు శివరామ రెడ్డి గారు భగవాన్ వద్దకు వెళ్లి వారి ముందు కూర్చున్నారు. భగవాన్ ఆయనపై దృష్టి సారించారు. కొద్ది క్షణాల పాటు శ్రీరమణుల కృపా కటాక్ష వీక్షణం శివరామ రెడ్డి గారి మీద పడగానే వారి దుఃఖము మటుమాయమైపోయింది.

భార్య మీద ప్రేమ ఇంకా ఉన్నప్పటికీ, ఆమె మరణం వల్ల ఇన్ని సంవత్సరాలుగా వారికి కలిగిన దుఃఖం వారిని విడిచి పెట్టేసింది. శ్రీ రమణులను దర్శించుకున్న ఉత్తర క్షణం, శివరామ రెడ్డి గారి హృదయంలో పరమ శాంతి మరియు గొప్ప సంతోషము ఉత్పన్నమయ్యాయి. ఇలా శ్రీ రమణుల పంచన కొంతకాలం గడిపి, తమ వ్యాపార వ్యవహారాలు చూసకోవటానికి స్వగ్రామం తిరిగి వెళ్ళి పోయారు శివరామరెడ్డిగారు.

1934వ సంవత్సరంలో మీ పినతండ్రి గారు మరణించారు, మీరు ఇక్కడికి వేంచేయండి అని శ్రీ రమణాశ్రమం నుండి శివరామ రెడ్డి గారికి పిలుపు వచ్చింది. శ్రీ కుంజు స్వామి వద్ద వారి పినతండ్రి ఏ విధంగా కన్నుమూశారో ఆ వివరాలన్నీ తెలుసుకున్న శివరామ రెడ్డి గారు శ్రీ రమణుల సూచనలను, సలహాలను అనుసరించి వారి పినతండ్రి గారికి అంత్యక్రియలు జరిపారు. శ్రీ రమణుల పాదాల చెంత ప్రాణాలను అర్పించిన వారి పినతండ్రి ఎంతో అదృష్ట వంతులని శివరామరెడ్డి గారికి అనిపించింది.

''అధ్యాత్మిక సాధనలోని రహస్యాలు, స్థితులు వంటి అంశములు మరియు త్రిపుటి గురించి, దానిని అధిగమించవలసిన అవసరం గురించి సాధకులకు తెలిసినప్పటికీ, సద్గురువు యొక్క సన్నిధానములో మాత్రమే, దానిని ఆచరణపూర్వక సత్యంగా, నిజమైన జీవన అనుభవంగా శిష్యులు గ్రహించగలుగుతారు'' అని శివరామరెడ్డి గారు తరచు అంటూ ఉండేవారు. నిశ్చలమైన

మౌనము మరియు ఆత్మశాంతి సాగరము సాధకుని ఆవరించాలి అంటే, సద్గురువు యొక్క అనుగ్రహము చేతనే అది సాధ్యపడుతుంది అని శివరామ రెడ్డి గారు తోటి భక్తులతో అనేవారు.

1934 సంవత్సరం నుండి ముప్పది సంవత్సరాల పాటు శ్రీ రమణాశ్రమం యొక్క పుస్తకాల షాపు మేనేజరుగా వారు వ్యవహరించారు. అచ్చటనున్న కొద్దిపాటి పనిని - అంటే పుస్తకాలు అమ్ముట, కట్టలు కట్టుట వగైరాలను ఆయన స్వయంగా చేసేవారు. శ్రీ శివరామ రెడ్డి గారు ఎల్లప్పుడూ ఆంతరంగిక ప్రకాశంలో, పరిపూర్ణ సత్యములో, పూర్తి చైతన్యంతో జీవితాన్ని కొనసాగించేవారు. నాలుగేళ్ల పాటు శ్రీ గణేశన్ గారు వారికి సహాయకుడిగా పనిచేశారు. 1965వ సంవత్సరంలో శివరామ రెడ్డి గారు తీవ్రంగా జబ్బుపడ్డారు. శ్రీ రమణాశ్రమమునకు భారంగా ఉండడం ఇష్టం లేక ఆశ్రమాన్ని వదిలి వెళ్లాలనే నిర్ణయానికి వచ్చి, వారు తమ కుమార్తెను పిలిపించుకున్నారు. ఆమె వచ్చి శ్రీ శివరామ రెడ్డి గారిని తమ స్వగ్రామమైన ఉత్తరామోరూర్‌కు తీసుకొని వెళ్లారు. వెళ్లేముందు గణేశన్ గారికి, తోటి భక్తులకు ‘‘అరుణాచలేశ్వరుడే సత్యము. సత్యము ఒక్కటే ఉన్నది. మీరంతా అరుణాచలేశ్వరుని తోనే ఉండండి’’ అని ఆశీస్సులు పలికిన శ్రీ శివరామరెడ్డి గారు నిజంగా ధన్యజీవి తపోసంపన్నులు.

******

# స్మృతులు

# జి.వి. సుబ్బరామయ్య

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ** Fragrant Petals **లోని నాల్గవ వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**సరోజా ప్రసాద్**

భగవాన్ శ్రీ రమణుల జీవితంలో ముఖ్య ఘట్టాలన్నీ భక్తులకు చిరపరిచితమే. తొలిసారి అరుణాచలం పేరు వినినంతనే, బాలుడైన వెంకటరామన్ కు కలిగిన పులకరింత, మదురైలో వారికి కలిగిన మరణానుభవం, ఇల్లు విడిచి అరుణాచలానికి రావడం, అక్కడే ఆనందానుభూతిలో మునిగి సుదీర్ఘ కాలం మౌనంగా ఉండటం, భక్తుల విజ్ఞప్తి మేరకు, మౌనం వీడి, బాహ్యములైన కార్యకలాపాల పునరుద్ధరణ, తొలుత విరూపాక్ష గుహలో, తరువాత స్కందాశ్రమంలో, అటు పిమ్మట శ్రీ రమణాశ్రమంలో నివాసం, భగవాన్ దర్శనార్థం ప్రపంచం నలుమూలల నుండి భక్తుల రాక, తన తల్లికి మోక్ష ప్రదానం, ఆశ్రమ ప్రాంగణంలో మాతృభూతేశ్వర ఆలయ నిర్మాణం, కేన్సర్ వ్యాధి సోకడం, తుదకు 1950 లో భగవాన్ మహా నిర్వాణం, ఆ సమయంలో అరుణాచల శిఖరం మీదుగా ఒక ఉజ్వల తార ఆకాశంలో పయనించడం - ఇవన్నీ భగవాన్ ఈ భూమిపై నడయాడిన కాల వ్యవధిలో సంభవించిన ప్రధాన సంఘటనలని చెప్పవచ్చు.

అయితే కొన్ని అపోహలను నివృత్తి చేయాల్సిన అవసరం కూడా ఉన్నది. 17వ ఏట మదురై నివాసంలో కలిగిన మరణం వంటి అనుభవం శ్రీ రమణులను పూర్తిగా మార్చివేసింది. అటు తర్వాత, వారు ఇక ఏ మాత్రం వెంకటరామన్ అనే వ్యక్తి కాదు. ఆ అనుభవం

పొందిన క్షణంలోనే, వారికి ఆత్మసాక్షాత్కారమై, పరమాత్మలో లీనమైనారు. అక్కడి నుండి తనలో మరే విధమైన మార్పు రాలేదని శ్రీ భగవాన్ పలుమార్లు పేర్కొన్నారు. నామ రూపాలకు అతీతమైన స్థితిలోనే, వారు నిలిచిపోయారు. ఇక అప్పటినుండి తన దేహానికి ఏమేమి జరిగిందో, అదంతా ఒక దివ్య శక్తి ప్రమేయంతోనే ఘటిల్లినదని, ఆ దివ్య శక్తే తనను మదురై నుండి తిరువణ్ణామలై తీసుకు వచ్చినదని, ముందు అరుణాచలం కొండపైకి, అక్కడి నుండి దిగువన రమణాశ్రమానికి తెచ్చిందని, అసంఖ్యాక భక్తులను తన చెంతకు ఆకర్షించినదని భగవాన్ చెప్పేవారు. ఇదంతా వారు మన తృప్తి కోసం చెప్పేవారు. బాల్యంలో ఎదురైన మరణానుభవం తరువాత జరిగిన ఏ సంఘటనలోను తన ఇచ్ఛ అనేదే లేదన్నారు భగవాన్. ఆ దివ్య శక్తే లక్ష్య సిద్ధి కోసం వారిని ఉపయోగించుకున్నది. ఏవైనా అద్భుతాలు జరిగినప్పుడు కూడా, అవి తనవలన జరిగినట్లు భావింపరాదని, అదంతా ఆ దివ్య శక్తి లీలయేనని, తాను కేవలం సాక్షిని మాత్రమేనని భగవాన్ చెప్పేవారు.

తిరువణ్ణామలై వచ్చాక భగవాన్ మౌనవ్రతం పాటించారని, దేహాన్ని బాధలకు గురిచేసి, కఠోర తపస్సు ఆచరించారని, క్రమేపి పరిణతి సాధించి సిద్ధ పురుషులైనారని భావించేవారు కూడా లేకపోలేదు. దీనిని భగవాన్ స్వయంగా నిరాకరించారు. తన ఇచ్ఛ అనేదే లేనందున, తానెటువంటి సాధన చేయలేదన్నారు భగవాన్. పైగా ఈ సాధన ద్వారా సాధించవలసినది అంటూ ఏమీ లేనందు వల్ల, సాధన చేయవలసిన అగత్యమే రాలేదని కూడా అన్నారు. బాహ్య జగత్తు వైపు చూడలని గాని, ఏమన్నా మాట్లాడాలని గాని అభిలాష లేనందున, కనులు మూసుకుని మౌనంగా

కూర్చునేవాడిని అని చెప్పారు. మామిడి తోటకు వెళ్ళినప్పటి నుండి కనులు తెరచి మాట్లాడానని, ఏది చేయాల్సి వస్తే ఆ పని చేసేవాడినని, అయితే దీని వెనుక తన సంకల్పం అంటూ ఏమీ లేదని భగవాన్ తెలిపారు. ఇంతకు మించి, వారిలో ఎటువంటి మార్పు లేదు. వారి వ్యక్తిగత జీవిత ప్రయోజనమంటూ ఏదన్నా ఉంటే, అది వారికి కలిగిన మరణానుభవంతోనే నెరవేరింది. అటుపిమ్మట, శాస్త్రాలు నిర్దేశించిన విధి నిషేధాలేవీ వారికి అంటలేదు. పదిహేడవ ఏట నుండే శ్రీ భగవాన్ సిద్ధ పురుషులు, జీవన్ముక్తులు, స్థిత ప్రజ్ఞులు, గుణాతీత అత్యాశ్రమి అయ్యారు. వారిలో ఏదో క్రమ పరిణామం జరగడం అనే ప్రశ్నే లేదు. వారు పరిపూర్ణతకు, పరిపక్వతకు మారుపేరు.

శ్రీ రమణుల వంటి మహాత్ములు అస్వస్థులు కావడం ఏమిటి, అందునా భయంకరమైన కేన్సర్ వంటి వ్యాధి బారిన పడటం ఏమిటి? అని విస్మితులయ్యేవారు కూడా ఉన్నారు. సాధారణ ప్రజ్ఞ గలవారు సైతం సంతోషంగా జీవించి, అనాయాసంగా మరణిస్తారు కదా! మరి శ్రీ రమణుల వంటి మహాజ్ఞాని అనుభవించిన శారీరక క్లేశం చూసినప్పుడు, "ఈ జ్ఞానం నిరర్థకమేనా?" అన్నది వారి ప్రశ్న. ఇక్కడ గమనించవలసినది ఒకటి ఉన్నది. ఆధునిక కాలానికే చెందిన శ్రీ రామకృష్ణ పరమహంస వంటి ఆత్మ జ్ఞానికి సైతం, గొంతుకు సంబంధించిన కేన్సర్ వ్యాధి సోకింది. నిజానికి ఇది అర్థం చేసుకోవటం సులభమే. జ్ఞానికి తన దేహం అంటూ ఉండదు. సంకల్పం కాని, కర్తృత్వ భావన కాని ఉండవు. సర్వమూ తానే అయి ఉంటాడు. తాను కాకుండా, అన్యం అనేదే ఉండదు. అయినా, మనబోటి అపరిపక్వ మనస్కులం జ్ఞానిని ఒక దేహం

తోను, వ్యక్తిత్వంతోను పరిగణిస్తాము. కనుక, మనలను సమాధాన పరిచేందుకు జ్ఞానులు కూడా మన స్థాయికి దిగివచ్చి, అనుల్లంఘనీయమైన ప్రారబ్ధ కర్మను అనుభవించే తీరాలని చెప్పవలసి వస్తుంది. జ్ఞాని శరీరం కూడా అనారోగ్యానికి, బాధలకు, క్లేశానికి అతీతం కాదు. అయితే, శరీరంలో ఏ మాత్రము సంగము లేని జ్ఞాని, ఆ శరీరానికి ఏమి జరిగినా చలించడు. శ్రీ భగవాన్ ఇందుకు ఉదాహరణ.

ఆ భయానకమైన వ్యాధి కారణంగా, శరీరం దుర్భరమైన బాధ అనుభవిస్తున్నా, ఎల్లవేళలా తేజోమయమైన ప్రసన్న వదనంతో భాసిల్లేవారు. ఆధ్యాత్మికోన్నతికి, శారీరక రుగ్మతలకు ఎటువంటి సంబంధమూ లేదని ఇందువల్ల మనకు బోధ పడుతుంది. ప్రారబ్ధ వశాత్తు ఈ శరీరం అనుభవించాల్సిన అసంఖ్యాక రోగాలు కాని, బాధలు కాని, ఆత్మను స్పృశింపజాలవు.

ఇదంతా చూసి, స్వరూప జ్ఞానం పొందడం నిరర్థకమేనా అని తర్కించే బదులు, భౌతికంగా ఎటువంటి సమస్యలు ఎదురైనా పట్టించుకోకుండా, మన ఆధ్యాత్మిక సాధన కొనసాగించాలన్న స్ఫూర్తిని పొందాలి.

చివరిగా, ఆత్మ శరీరానికి అతీతమైనది అనడానికి ఇంకా ఆధారాలేమైనా కావాలంటే, శ్రీ భగవాన్ మహా నిర్వాణ సమయంలో సంభవించిన అసాధారణ, అతిలోక ఖగోళ విశేషాన్నే చెప్పవచ్చు. అది మహాత్ముల నిష్క్రమణకు నివాళిగా, ఊర్ధ్వ లోకాలు వెలిగించిన తేజోమయ కాంతిపుంజం మాత్రమే కాదు. శ్రీ భగవాన్ మనం భావించినట్లు పాంచభౌతిక దేహం కాదని, సాక్షాత్తు పరమాత్మ స్వరూపులని మనకు ఎఱుక పరచిన దివ్యశక్తి లీలా విశేషం.

## స్మృతులు III

# ఇద్దరు గొప్ప పండిత భక్తులతో విశ్వనాథ స్వామి

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ Surpassing Love and Grace లోని మూడవ వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**అనువాదకులు: శ్రీ రవికృష్ణ శర్మ**

శ్రీ మురుగనార్ గారు భగవాన్ దగ్గరికి మొదటిసారి 1923వ సంవత్సరం సెప్టెంబర్ నెల సెలవులలో వచ్చారు. వారు మద్రాసు లోని ఒక క్రిస్టియన్ బాలికల హైస్కూలు (ఉన్నత పాఠశాల)లో తమిళ ఉపాధ్యాయులు. వారు అప్పటికే "తిరుక్కురళ్" అనే తమిళ గ్రంథాన్ని చాలా భక్తితో చదివి, దాని యందలి బోధలను వారి నిత్య జీవితంలో ఆచరించుచున్నారు. వారిని, వారితో పనిచేసే సహ అధ్యాపకులు మరియు వారి దగ్గర చదువుకునే విద్యార్థులు గొప్ప గౌరవభావంతో చూడటం ఏమంత అద్భుతమైన విషయం కాదు.

భగవాన్ గురించి మురుగనార్ గారికి కొంతమంది మద్రాసులో నివసించే భక్తుల ద్వారా మరియు వారి మామగారైన దండపాణి స్వామి గారి ద్వారా తెలిసింది. వారి సంసార జీవితంలో వారికి ఎదురైన పరిస్థితులు కూడా వారు ముక్తి మార్గంలోకి రావటానికి అనుకూలించాయి. అయినా కూడా వారు తమ ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తూ, భగవాన్ వద్దకు తమ సెలవు దినములలో వస్తూ ఉండేవారు. వారు ఎంత భక్తిపరులంటే, పాఠశాలలో సెలవు దినములు ప్రకటించిన వెంటనే రమణాశ్రమమునకు ఉపాధ్యాయుడుగా నెత్తిమీద ధరించే తలపాగాతోను మరియు

చొక్కాపై ధరించే కోటుతో సహా వచ్చి, మళ్ళీ పాఠశాల పునః ప్రారంభించే దినమునాడే మద్రాసుకు తిరిగి వెళ్ళేవారు. వారు మహాత్మాగాంధీ గారి భావజాలానికి ప్రభావితమైనవారు. మహాత్మా గాంధీ గారు ఎన్నో ప్రాపంచిక వ్యవహారాలలో తలమునక లైనప్పటికీ, వారి శుద్ధమైన, స్వచ్ఛమైన జీవితంతో అందరి యొక్క మన్ననలు మరియు గౌరవాన్ని పొందారు. మురుగనార్ గారు మహాత్మాగాంధీ గారిని పొగుడుతూ పాడిన గీతాలు మరియు జాతీయ ఐక్యతను చాటే గీతాలను శ్రీ రమణ పాదానందం గారు 1943లో "సుతాంతర గీతాలు" అనే శీర్షిక ద్వారా ప్రచురింప చేశారు.

మురుగనార్ గారు గొప్ప భాషా ప్రవీణులు మరియు గొప్ప తమిళ పండితులు అయినప్పటికీ, వారు మొదటిసారి భగవాన్ ను దర్శించటానికి వచ్చినప్పుడు పది శ్లోకాలతో కూడిన ఒక పదికాన్ని తమిళంలో రచించి ప్రతి శ్లోకానికి చివర "--- దేశిక రమణ మాదేవ" (గొప్ప సద్గురువు మరియు గొప్ప దైవమైన రమణా) అని వచ్చేలా పూరించారు. వారు తరుచూ వచ్చిపోతూ ఉన్న ఒక సందర్భమున, డిసెంబర్ నెలలో ఒక రోజున భగవాన్ ను స్తుతిస్తూ "అణ్ణామలై రమణ"--- అనే పదంతో మొదలుపెట్టి, ఒక పాటను తిరువాచకం లోని తిరువెంబావైను అనుసరిస్తూ పాడారు. అది గమనించి, భగవాన్ మురుగనార్ గారికి ఈ విధంగా సూచించారు. మాణిక్య వాచకులు వ్రాసిన తిరువాచకం యొక్క మూల భావాలను మరియు వారియొక్క ఆలోచనాసరళిని అనుసరించి వారు వ్రాసిన విధంగా మీరు వ్రాయవచ్చును కదా అని అన్నారు. మురుగనార్ గారు ఆ మాటకు స్తంభించిపోయి "మాణిక్యవాచకుల వారెక్కడ నేనెక్కడ?" అని అన్నారు. కాని తరువాత, ఇది గురు ప్రేరణ లేదా

ఆజ్ఞ అని నెమ్మదిగా అనుకొని, భగవాన్ అనుగ్రహం మీద ఆధారపడి భగవాన్ సూచనను పాటించటం మొదలుపెట్టారు. దాని ఫలితమే చాలా అద్భుతమైన, సుపరిచితమైన, మనస్సును రంజింపచేసే తమిళంలో వారిచే పొందుపరచబడిన "శ్రీ రమణ సన్నిధి ముఱై" అనే మహద్గ్రంథం. మూడవ సంకలనాన్ని రమణాశ్రమం వారు 1974వ సంవత్సరంలో ముద్రించారు. అలాగే మురుగనార్ గారు, భగవాన్ బోధలను తమిళంలో వచన పూర్వకంగా రచించి గురువాచక కోవై (ఆంగ్లంలో ప్రొ. కే. స్వామినాథన్ గారు, గార్లాండ్ ఆఫ్ గురూస్ సేయింగ్స్ అని తర్జుమా చేశారు) అనే గొప్ప గ్రంథాన్ని మనకు అందించారు. అదేకాకుండా, వారు రచించిన కొన్నివేల రచనలను ఒక క్రమబద్ధం చేసి వాటిని ఎన్నో సంకలనాలుగా "రమణ జ్ఞాన బోధం" అనే శీర్షికతో ముద్రించారు.

భగవాన్ వద్దకు వచ్చిన కొన్ని సంవత్సరముల తరువాత, మురుగనార్ గారి తల్లిగారు పరమపదించారు. వారి తల్లిగారు కాలం చేసిన తరువాత, మురుగనార్ గారు తమ సద్గురువు పాదముల చెంతకు శాశ్వతంగా వచ్చేశారు. ఇక్కడకు వచ్చిన తరువాతే రమణ సన్నిధిముఱైలోని ఎన్నో పాటలను భగవాన్‌కు భక్తిపూర్వకంగా అర్పిస్తూ కూర్చారు. తమిళ భాషాప్రవీణులు ఎవరైతే తమిళ భాష లోని నిఘంటువుకి మురుగనార్‌తో కలసి పనిచేశారో వారందరూ కూడా, భగవానే వారి యొక్క వైభవాన్ని గూర్చి అందరికీ చాటటానికి ఒక గొప్ప భాషాప్రావీణ్యం కలిగిన మురుగనార్ గారిని ఏరికోరి ఎంచుకున్నారు అని అన్నారు. పండితులందరు కూడా తమ పాండితీప్రకర్షతో భగవంతుని ఆరాధిస్తారు. ఆ పాండిత్యం ఒక్కటి చాలు వారి సాధనకు. ఆ పాండిత్యంతో మాటలకు అందని,

అపురూపమైన దైవానికి ఒక రూపాన్ని ఇచ్చి, ఆ రూపాన్ని భక్తితో ఆరాధించే విధంగా చేయగలరు.

మనమందరము మురుగనార్ గారికి ఎంతో కృతజ్ఞులమై ఉండాలి. ఎందుకంటే భగవాన్ చే కూర్చబడిన ఉపదేశ ఉందియార్ (అన్ని బోధల యొక్క సారము) మరియు ఉళ్ళదు నార్పదు (ఉనికి మీద 40 శ్లోకాలు) అనే చాలా ముఖ్యమైన భగవాన్ తత్త్వాన్ని తెలియజేసే గొప్ప తత్త్వ జ్ఞానాన్ని మనకు అందించారు. అలాగే మురుగనార్ గారి అభ్యర్థన మేరకు ఆత్మవిద్య అనే అందమైన కావ్యాన్ని కూడా భగవాన్ కూర్చారు.

మురుగనార్ గారు కూడా నేను (విశ్వనాథ స్వామి) ఏ విధంగా ఎవ్వరి మీద ఆధారపడకుండా జీవిస్తున్నానో, అదే విధంగా వారు కూడా జీవించటం మొదలుపెట్టారు. మేమిద్దరం అరుణాచలం కొండ మీద, మామిడిచెట్టు గుహకు దగ్గరలో ఒకే చోట కలిసి కొన్ని నెలలు ఉన్నాము. ఆ సమయంలో గణపతి ముని గారు ఆ మామిడి చెట్టు గుహ యందే నివసించుచున్నారు. మురుగనార్ గారు ప్రతి సాయంత్రము భగవాన్ సమక్షంలో గడపటానికి ఉత్సుకతను చూపేవారు. నేను వారితో పాటుగా వెళ్ళేవాడిని. కొన్ని నెలల తరువాత ఆశ్రమమునకు పడమటి భాగాన పలాకొత్తు యందుగల పూలవనంలో మురుగనార్ గారు ఒక గదిని తీసుకుని నివసించటం మొదలుపెట్టారు. భగవాన్ ప్రతి రోజు మధ్యాహ్నం భోజనం అయిన తరువాత, ఒక్కరే పలాకొత్తు వైపునకు వెళ్తూ ఉండేవారు. కొన్నిసార్లు భగవాన్ మురుగనార్ గారు ఉంటున్న గదిని కూడా సందర్శించేవారు.

గణపతి ముని గారు ఒకసారి భగవాన్‌తో ఈ విధంగా అన్నారు. నేనెన్నో అడవులను చూశాను కాని అరుణాచలంలో ఉన్న అడవిని చూడలేదని అన్నారు. అరుణాచలం కొండమీద ఉన్న అడవిలోని ప్రతి అడుగు భగవాన్ కు బాగా తెలుసు. అందుకే భగవాన్ గణపతి ముని గారిని ఏదో ఒక రోజు అడవిలోకి తీసుకొని వెళ్తాను అని చెప్పారు. గణపతి మునిగారికి కపాలభేదం అవటం వలన మరియు అత్యున్నత యోగిక శక్తులు కలిగి ఉండడం వలన వారు ఎండ వేడిమిని ఏ మాత్రము తట్టుకొనలేరు. కాబట్టి భగవాన్ ఆకాశం మబ్బులతో నిండిన దినం కోసం వేచి చూచారు. ఒక రోజున అటువంటి దినం రానే వచ్చింది. అప్పుడు భగవాన్ నన్ను, నాయన గారికి ఈ దినము అడవిలోనికి పోవటానికి వీలు పడుతుందేమో కనుక్కోమన్నారు. అప్పుడు నేను, నాయనగారు ఈ సదవకాశం గురించి వినగానే ఆనందంతో ఎగిరి గంతేస్తారు అని అన్నాను. అలా చెప్పి, నాయనగారు పలాకొత్తులో నివసించే గదికి వెళ్లి భగవాన్ ల ఉద్దేశాన్ని వారికి విన్నవించాను. కొన్ని నిమిషముల తరువాత భగవాన్ ఆ గదికి వచ్చారు. మేము ముగ్గురము కలిసి అడవిలోనికి బయలుదేరాము. భగవాన్ మమ్మల్ని అడవిలోనికి వెళ్ళే మూడవ దారిగుండా తీసుకుని వెళ్ళారు. ఒక మైలు దూరం నడిచిన తరువాత, భగవాన్ ఒక చల్లనయిన, చక్కని నీడనిచ్చే ఒక పెద్ద కొండరాయికి ప్రక్కన ఉన్న ప్రదేశంలో కాసేపు విశ్రాంతి తీసుకోవటానికి ఆగారు. మేమక్కడ కూర్చొనగానే, ఎవరో అక్కడ పడివున్న ఆకులను త్రొక్కుతూ మావైపు వస్తున్నట్లుగా అనిపించింది. ఒక్క నిమిషంలో, మురుగనార్ గారు మా ముందు ప్రత్యక్షమైనారు. భగవాన్ ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ, తన ముక్కుమీద వేలు వేసుకొని

“మీరు ఇక్కడికి ఎలా రాగలిగారు? అడవిని రక్షించే అధికారులకు కూడా తెలియని మరియు గుర్తించలేని ప్రదేశానికి మేము వచ్చామే” అని అన్నారు. అప్పుడు మురుగనార్ గారు ఈ విధంగా చెప్పారు. భగవాన్ నాయనగారిని ఏదో ఒక రోజున అడవిలోనికి తీసుకొని వెళదాము అని అన్న మాట నాకు గుర్తుంది. నేను కూడా మీతో కలిసి వద్దాము అని అనుకొని, ఆశ్రమమునకు రోజూ వచ్చే దానికంటే ముందే వచ్చాను. కాని ఈవేళ మీరు ఆశ్రమంలో లేకపోవటం గమనించి నాయనగారు ఉండే గదికి వెళ్లి చూడగా, వారి గదికి తాళం వేసి ఉండడం చూసి, ఆశ్రమ కాపలాదారు అయిన సభాపతిని అడుగగా, మీరు, నాయనగారు మరియు విశ్వనాథ స్వామి కలిసి అడవి మార్గం వైపునకు వెళ్ళారు అని చెప్పాడు. నేనప్పుడు అడవిబాట పట్టాను. అడవిలోనికి వెళ్ళే రెండవ మార్గంలో కొంతదూరం పయనించేటప్పటికి, అక్కడ ఒక కాలిబాట ఇంకా అడవి లోపలికి ఉండడం గమనించి, ఆ మార్గాన్ని అనుసరించి రావడం వలన నేను మీ వద్దకు చేరుకున్నాను అని అన్నారు. భగవాన్ అప్పుడు “ఇటువంటి ఒక దగ్గరి మార్గం కూడా ఉన్నదా? అయితే ఆ మార్గము నుండి మనము ఆశ్రమమునకు వెళదాము” అన్నారు. నాయనగారు మురుగనార్ గారిని మృదువుగా తట్టి “భగవాన్ యొక్క అనుగ్రహమునకు మీరు ఎంత పాత్రులై ఉన్నారో అన్న దానికి ఇది ఒక సూచిక” అని అన్నారు. అందరమూ కలిసి సాయంత్రము 4 గంటలలోపు ఆశ్రమమునకు చేరుకున్నాము. భగవాన్ తోను మరియు ఈ ఇద్దరు పండిత భక్తులతోను నేను అంత దగ్గరి అనుబంధం కలిగి ఉండడం అనే విషయాలను తలుచుకొన్నప్పుడు, నాకు రోమాంచితమౌతుంది.

### అధ్యాయము - 1

# మూగ రాగం - మౌన గీతం
# మమత సంగీతం - సమత సంకేతం

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ** Bhagavan Ramana The Friend of all Creation **లోని మొదటి వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**వి. రమేష్ బాబు**

సకల జీవుల స్నేహితుడు భగవాన్ రమణ మహర్షి. అందరి బంధువయా అరుణాచల రమణయ్య. ఆయనను నమ్మిన వారందరికీ ఆయన ఆత్మీయ బంధువు.

ఆయనను నమ్ముకున్న గోలక్ష్మికి మోక్షం ఇచ్చారు. ఒక పవిత్రాత్మ జింక, ఆయన చేతులలో తనువు చాలించింది. ఆశ్రమంలో సమాధి చేశారు. ఒక కాకి ఎక్కడి నుండో ఎగిరి వచ్చి భగవాన్ పాదాల చెంత వ్రాలి ప్రాణం విడిచింది. దానిని స్వయంగా భగవానే సమాధి చేశారు. శునకాలు ఆయన సహచరులు, అవి ఆశ్రమ సందర్శకులకు మార్గదర్శకులుగా (గైడు) వ్యవహరించేవి. జాకి అనే కుక్కకు చివరి దశలో శరీరం నుండి ఎంత దుర్గంధం వస్తున్నా స్వయంగా భగవానే ఎంతో సేవ చేశారు. మరణానంతరం ఆశ్రమంలో సమాధి చేశారు.

అన్నీ ఆత్మనే. అన్నిటి పట్లా ఆయనది సమదృష్టి. ఆ సమదృష్టికి సాక్ష్యాలే ఆవు, జింక, కాకి, కుక్క సమాధులు. అవి ఆశ్రమంలో నేటికీ నిలిచి ఉండి సాక్ష్యమిస్తున్నాయి.

నెమళ్ళు వారి ముందు నాట్యం చేసేవి. "సిత మయూరాష్టకం" పద్యాలు వీణ మీద ఆలపిస్తే, తెల్ల నెమలి తదనుగుణంగా నాట్య

విన్యాసం ప్రదర్శించింది. దెబ్బతిన్న పావురాళ్ళకు, జంతువులకు స్వయంగా వారు వైద్యం చేసేవారు.

చిరుతలతో సహా, తల్లిలేని పసి కూనలను వారు కన్న తల్లిలా పెంచారు. వారి స్పర్శతో అవి పసిపిల్లల్లా ప్రవర్తించాయి. ఆయన ఒడిలో అవి హాయిగా నిదురించాయి. పెద్ద పులులు - చిరుతలు వారి మాట వినేవి. పొమ్మంటే మౌనంగా వెళ్లిపోయేవి. ఉడుతలు వారి వంటి మీద ప్రాకి చేతులలోని జీడి పప్పులు తీసుకుని తినేవి.

పాములు - తేళ్ళు ఆయన శరీరం మీద ప్రాకుతూ వెళ్లిపోయేవి. అన్ని జంతువుల, పక్షుల భాషలు వారికి కరతలామలకము. వారి మధ్య తగవులు వస్తే మధ్యవర్తిగా ఉండి వాటికి రాజీ చేసేవారు.

తమకు అపకారం జరిగిందని పిచ్చుకలు ఫిర్యాదు చేస్తే వారు పరిచారకులను పిలిచి మందలించేవారు. ఏ జీవికి అపకారం జరిగినా వారు ఎంతో బాధపడేవారు. చెట్ల పూలు, ఆకులు అతిగా తెంపితే, అలాటి వారిని మందలించే వారు.

ఓ మహాత్ముడు బంగారు రంగు ముంగిస రూపంలో భగవాను దర్శనానికి వచ్చారు. ఓ మహనీయుడు అర్థరాత్రి కుక్క రూపంలో వచ్చి ప్రసాదం తిని వెళ్ళారు. ఆశ్రమంలో వారి సన్నిధిలో, పక్షులు జంతువులు జాతి వైరం మరచి ప్రదర్శించేవి.

చీమల నుండి, ఏనుగుల దాకా సకల జీవులలో ఆత్మను చూసేవారు. శరీరాన్ని చొక్కా లనేవారు. తొడిగిన చొక్కా చూడకండి, లోపలి ఆత్మను చూడండి అనేవారు. మనిషి, జంతువు, పక్షి, చీమ - చెట్టు అన్న వ్యత్యాసం లేదు. అన్నీ ఆత్మలే. అన్నింటి పట్లా ఆయనది సమాన దృష్టి. ఎందరో మహనీయులు వివిధ రూపాలలో వచ్చి భగవానుని దర్శించి వెళ్ళేవారు. వారి మౌన శక్తి నేటికీ

తెలుస్తుందంటారు భక్తులు. సకల జీవుల ప్రేమికులు భగవాన్. ఆయన సమదర్శి, అహింసా మూర్తి, మౌన గని - మౌన ముని.

## అధ్యాయము - 2

## భగవాన్ తో జంతు భక్తులు

‘‘కుఱ్ఱవాళ్ళకి అన్నంపెట్టారా?’’ కొత్త వారికి ఈ మాట వినగానే, యువకులకు అన్నంపెట్టారా అని ప్రశ్నించారని అనుకుంటారు. కుఱ్ఱవాళ్ళంటే నిజానికి భగవాన్ రమణ మహర్షి దృష్టిలో ఆశ్రమంలో పెరిగే కుక్కలు. పరిచారకుడు వచ్చి ఒక విజిల్ వేయగానే కుక్కలన్నీ క్రమశిక్షణగా వచ్చి భోజనం చేస్తాయి.

‘‘లక్ష్మి వచ్చింది ఆమెకు ఇడ్లీలు పెట్టండి’’ అనగానే లక్ష్మి అనే అమ్మాయికి ఇడ్లీలు పెట్టమంటున్నారు అని అనుకుంటారు. నిజానికి ఆశ్రమంలో భగవాన్ దగ్గర పుత్రికలాగా పెరుగుతున్న ఆవు ‘‘గోలక్ష్మి’’.

ఆమె పసిబిడ్డతో వచ్చారు, వారికి కాసిని పళ్ళు ఇచ్చి పంపించండి అంటే ఓ అమ్మ తన పసిబిడ్డతో వచ్చింది కాబోలు, భగవాన్ పళ్ళు ఇమ్మంటున్నారు అనుకుంటారు. నిజానికి అక్కడకు ఓ తల్లి కోతి తన పసికోతితో వచ్చింది. భగవాను మంచం ప్రక్కన ఉన్న కిటికీలో నుండి ఎంతో ప్రేమగా, భక్తిగా భగవాన్ను చూస్తూ ఉంటుంది ఆ తల్లి కోతి.

కమలా! ఇలా రా! ఈ క్రొత్తవారిని జాగ్రత్తగా గిరి ప్రదక్షిణకు తీసుకొని వెళ్ళిరా! కమలంటే ఓ మార్గదర్శి (గైడ్) అనుకుంటారు. నిజానికి కమల అంటే కుక్క. అది భక్తులను అరుణాచలం గిరి చుట్టూ త్రిప్పుతూ ముఖ్యమైన ప్రదేశాల దగ్గర ఆపి, వారు చూసిన తరువాత బయలు దేరి తిరిగి ఆశ్రమానికి తీసుకు వస్తుంది. (సశేషం)

# The Road to Contentment

Dr K Subrahmanian

We all expect something from God; we believe that worshipping him will result in greater prosperity – family and relatives will fare well, there will be money, more fame and name, etc. From experience, we also know that we do not always get what we desire. Sometimes, misfortunes come to us so swiftly that some of us lose complete faith in God. Many times, we wonder what it is that we should do in order to get what we want. We convince ourselves that we have to earn and save, so that we can be comfortable in the future. To achieve this, we do a number of things and travel to a number of places; for in order to make money, we have to make some sacrifices. In fact, a person who makes a lot of money makes a lot of sacrifices. For example, he cannot eat on time, or he has to please a lot of people.

The individual spends his whole lifetime earning money because he would like to be considered prosperous. Those who don't have money may consider the man rich, but they do not understand the constant fear he lives in. The person has to take precautions to ensure the money does not fall into the wrong hands. He spends a lot of his time thinking about how to invest wisely. Others will not be aware of all these things. The thing about money is that the more we have, the more we want, because money means power; a lot of people want power either directly or indirectly. One can become an MLA or an MP with money power and also

help people, or give money to MLAs or MPs, who in turn will be obliged to the person. The power of money is seen not only in politics, but also in religion. Even religious leaders are influenced by the rich because these individuals are leaders, not *jnanis*. Since they belong to a particular *mutt*, they are interested in money to build schools and so on. Rich people, nowadays, seem to have control over politicians and even religious institutions.

